# మన పండుగలు
# దీపావళి

పండుగలు అనేవి ఒక జాతి సంస్కృతి, సాంప్రదాయపు విలువలకి అద్దం పట్టే నిదర్శనాలు. అలాంటి పండుగలలో దీపావళి ఒకటి. భారత జాతి, స్త్రీకి ఇచ్చే ఉన్నతమైన స్థానాన్ని నిరూపిస్తుంది ఈ దీపావళి పండుగ. కుల, వర్గాలతో నిమిత్తం లేకుండా యావత్ భారత జాతి జరుపుకునే ఈ పండుగని ఒక్క హిందువులు మాత్రమే కాకుండా, సిక్కులు, జైనులు కూడా జరుపుకుంటారు. దీపావళి అంటే దీపాల వరుస అని అర్థం. అందుకనే మనం దీపావళి రోజున ఇల్లంతా దీపాలతో అలంకరిస్తాం. ఇప్పుడైతే అరుగులు లేవు గానీ, ఇంతకు మునుపు అరుగుల మీద మట్టితో చేసిన దీపపు ప్రమిదలు వరుసగ పెట్టి వెలిగించేవారు. ఇక దీపావళికి కొద్ది రొజులు ముందూ, కొద్ది రోజులు తరువాతా, ఎంతో సంబరంగా బాణాసంచా (టపాసులు) కాలుస్తారు. దీపావళి అంటే పిల్లలకి పెద్దలకీ అందరికీ సంబరమే మరి.

దేశంలో వివిధ ప్రాంతాలలో ఉన్న ఆచారాలనుబట్టి ఈ పండుగ ఐదు లేక ఆరు రోజులపాటు జరుగుతుంది. ఆశ్వయుజ కృష్ణ ద్వాదశి నుండి మొదలై కార్తీక శుద్ధ విదియ వరకూ ఆరు రోజులు. ఒక్కక్క రోజుకూ ఒక్కొక్క ప్రత్యేకత. మొదటి రోజుని 'వసు ద్వాదశి' అంటారు. ఈ రోజున ఆవుల్ని, దూడల్ని కలిపి పూజిస్తారు. ఈ మధ్య కాలంలో దీన్నెవరూ జరుపుకుంటున్నట్టు కనపడదు.

రెండవ రోజుని 'ధన త్రయోదశి' అంటారు. ఈ ధన త్రయోదశి రోజున బంగారం వంటి విలువైన వస్తువుల్ని కొనుక్కుంటారు. గృహస్థులైన ప్రతి ఒక్కరూ ధనాన్ని సంపాదించాలి. సంపాదించిన ఆ ధనాన్ని కుటుంబ శ్రేయస్సు కోసం, సమాజ శ్రేయస్సు కోసం వినియోగించాలని సూచించే పండుగ ఈ ధన త్రయోదశి. ఈ త్రయోదశినే 'ధన్వంతరి త్రయోదశి' అని కూడా అంటారు. క్షీరసాగర మధనం సఫలమై, శ్రీ మహావిష్ణువు ధన్వంతరి అవతారంలో అమృతాన్ని వెలికి తెచ్చిన రోజు ఇదే అని పురాణోక్తి.

ఇక మూడవ రోజు 'నరక చతుర్దశి'. ఈ నరకాసుర కథ మనందరికీ బాగ తెలిసిన కథే. స్త్రీని ఒక విలాస వస్తువుగా భావించి అనేక మంది స్త్రీలను చెరపట్టిన నరకుని, మాతృ స్వరూపిణి అయిన అమ్మ సత్యభామా రూపంలో వచ్చి, వధించి స్త్రీ వైభవాన్ని పునరుద్ధరించింది. ఆంధ్ర దేశంలో ఈ నరక చతుర్దశిని బాగా సంబరంగా జరుపుకుంటారు. తెల్లవారు ఝాముననే స్నానాదికాలు పూర్తి చేసుకొని, నరకాసురుడి దిష్టి బొమ్మనొకదాన్ని దగ్ధం చేస్తారు. ఇంకా కొందరు టపాసులు కూడా కాలుస్తారు. ఇంటి ముందర చక్కటి ముగ్గులు దిద్ది, క్రొత్త బట్టలు కట్టుకొని, ఆ రోజు కృష్ణుడిని పూజిస్తారు. అహంకారాన్ని తొలగించుకోవాలని ఈ నరక చతుర్దశి మనకు నిర్దేశిస్తుంది.

నిజానికి నరకాసుర సంహారం చతుర్దశి రోజునే అయిపోయినా, విజయులైన సత్యభామాకృష్ణులు నరకాసురిడి నగరమైన ప్రాగ్జ్యోతిష పురంలోకి ప్రవేశించి, నరకుని చెరలో బందీలైన వారందరినీ విడిపించి, తిరిగి వచ్చింది ఆ మరుసటి రోజున. అదే ఆశ్వయుజ అమావాస్య నాడు. నరకుడంతరించి ప్రపంచంలోని అహంకారపు చీకట్లు అంతరించిన రోజుగా ఆ నాడు అందరూ వారి ఇళ్ళనూ, నగరాల్నీ, పట్టణాల్నీ, గ్రామాల్నీ దీపాలతో అలంకరించి పండుగ జరుపుకున్నారు. ఇదే దీపావళి. పండుగలో అతి ముఖ్యమైన రోజు. ఈరోజునే సీతారామలక్ష్మణులు అరణ్యా వాసం ముగించుకొని అయోధ్యకు తిరిగి వస్తున్నారన్న వార్త రావటం, ఆ శుభాగమనాన్ని పురస్కరించుకొని అయోధ్యావాసులందరూ తమ తమ ఇళ్ళనీ, వీధుల్నీ దీపాలతో అలంకరించుకోవటం ఈ దీపావళి రోజునే జరిగాయని ఒక కథ. అలాగే, ఈ దీపావళి రోజుననే పార్వతీ దేవి తపస్సుకి మెచ్చిన పరమశివుడు, అమెకు తన శరీరంలో అర్ధభాగం ఇచ్చాడని మరొక కథ. దీపావళి రోజున బంధు మిత్రులతో కలిసి శక్తి స్వరూపిణి, ఐశ్వర్య దాయిని అయిన శ్రీ లక్ష్మీ దేవిని పూజించడం, భోజనం చెయ్యటం, బాణాసంచా కాల్చటం చేస్తారు. స్త్రీని గౌరవించాలని, ఆనందాల్నీ ఐశ్వర్యాన్ని కలిసి పంచుకోవాలని తెలియచెప్పే పండుగ

దీపావళి.

ఇక ఐదవ రోజు, గోవర్ధన పూజ. దీన్ని ఎక్కువగా ఉత్తర భారతదేశంలో జరుపుకుంటారు. ఈ రోజున శ్రీ కృష్ణుడు గోవర్ధన పర్వతాని చిటికెన వ్రేలితో ఎత్తి ఇంద్రుడికి గర్వ భంగం చేసాడని ప్రతీతి. ఈ రోజునే, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలలో 'బలి పాడ్యమి' అన్న పేరుతో జరుపుకుంటారు. వామన మూర్తిగా అవతరించిన శ్రీ మహా విష్ణువు, బలి చక్రవర్తిని రసాతళంలోకి త్రొక్కేసాడని చెప్తారు. పెట్టేవాడిని నేనే... చేసేవాడిని నేనే... చెందేవాడిని నేనే... అనే అజ్ఞానాన్నీ, అహంకారాన్నీ విడిచి పెట్టమని ఈ బలి పాడ్యమి బోధిస్తుంది. మహారాష్ట్ర లో అయితే, ఈ రోజుని 'పడావా' అంటారు. భర్తలు తమ తమ భార్యలకి బహుమతులిస్తారు. గుజరాత్ లో అయితే ఈ రోజుని విక్రమ సంవత్సరాది గా జరుపుకుంటారు.

ఇక చివరిది, 'భగినీ విదియ' లేక 'భయ్యాదూజ్'. ఈ రోజున అక్క, చెల్లెలు చేతులతో వండిపెట్టిన భోజనం సోదరుడు చెయ్యటం, తరువాత ఆప్యాయంగా వారికి కానుకలివ్వడం ఒక విశిష్టమైన ఆచారం. సోదర సోదరీమణుల మధ్య అనుబంధం ఎంత అపురూపమైనదో ఈ పండుగ వివరిస్తుంది.

స్త్రీ ఔన్నత్యం, అనుబంధాలు, సమాజ శ్రేయస్సు వంటి ఉన్నతమైన విలువల్ని నిరూపించటమే దీపావళి పరమార్ధం. ఈ పురాణ కథలన్నింటి అంతరార్ధమూ ఒక్కటే. దీపావళి పండుగ ప్రధానోద్దేశ్యమూ ఒకటే. అజ్ఞాన స్వరూపమైన చీకటిని, జ్ఞాన స్వరూపమైన దివ్వెలతో తొలగించటం. ఈ సందేశాన్ని మనమందరం గ్రహించి జ్ఞాన జ్యోతుల్ని వెలిగించుకోవాలని నా ఆకాంక్ష.

భవదీయుడు,
అప్పాజీ.